ఉష

శ్రీమతి డి. వాణి

ప్రకాశం !

నా ఒంట్లో యేమీ బాగులేదు. అర్థంలేని కక్షతో మిమ్మల్ని దూరంచేసుకొని యేకాకినైపోయాను. ఉషను చూడాలని చాల ఆత్రుతగా ఉంది. నేను మీకు చేసిన ద్రోహాన్ని మర్చిపోరూ! నన్ను చూడటానికి మీరిద్దరూ వస్తే నా యీ ఆఖరిక్షణాల్లో మనశ్శాంతి చేకూర్చినవారవుతారు. ఎంతో ఆశతో వ్రాస్తూ మీరాకకోసం నిరీక్షిస్తున్నా - శ్రీరాం;

ఉత్తరం చదివిన ప్రకాశరావు క్రుంగిపోయాడు. తన నిరాదరణమూలంగా తిరిగి రాలేని దివ్యలోకాలకు వెళ్లిపోయింది ఉష! తనామెకు యెంత ద్రోహం చేశాడు! మామగారైన శ్రీరాం ముఖం యెట్లాచూడగలడు! ఉష యేదంటే తనేమని సమాధానం యివ్వగలడు? ప్రకాశరావు కళ్లలో నీళ్లు తిరిగాయి శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయాడు.

♦ ♦ ♦

అందమూ, తెలివితేటలూ, ఔదార్యమూ మూర్తీభవించిన ఉష యింజనీరు శ్రీరాం యేకైక పుత్రిక. చిన్నతనంలోనే తల్లి కరువైన ఉషను అల్లారుముద్దుగా పెంచాడు తండ్రి. ఉష కాలేజీలో బి. ఏ. చదువేరోజుల్లో ప్రకాశరావుతో పరిచయమైంది. అతను స్కాలర్‌షిప్‌తో ఎమ్. ఏ. చదువుతున్నాడు. విద్యార్థులందరూ ఉషపరిచయంకోసం తహతహలాడేవారు. కాని ఆమె ముభావంగా ఉండేది. ప్రకాశరావు తెలివితేటలూ అతనిలోని విజ్ఞానకాంక్ష ఆమెను చాల ఆకర్షించాయి. ఏకాకి, దరిద్రుడూ అయిన ప్రకాశరావుతో శ్రీమంతుల యింటిపిల్ల ఉష స్నేహం చేయడంచూచి చాలమంది అసూయపడ్డారు. కాని ఉషలక్ష్యపెట్టలేదు.

ఇద్దరూ తరచుగా లైబ్రరీలో కలిసేవారు. వారి సంభాషణలో యెన్నో విషయాలు దొర్లేవి. రెండు సంవత్సరాల్లో వారెంతో ఆత్మీయులైనారు. ఉష తన నిండు హృదయాన్ని ప్రకాశరావుకి అర్పించింది.

ప్రకాశరావుకి ఉష అంటే ప్రేమ, గౌరవమూ ఉన్నాయి. ఒక్కొక్కసారి ఆమె తన భార్య అయితే తన జీవితం ధన్యమౌతుందనుకునేవాడు. కాని వెంటనేయెదురుగా తనదారిద్ర్యం, ఒంటరితనమూ వికటాట్టహాసం చేస్తూ తాండవించేవి. తన వాంఛను అణగద్రొక్క ప్రయత్నించేవాడు.

పరీక్షలు పూర్తయాయి. పార్కుకి వెళ్తున్న ఉషకు ప్రకాశరావు కన్పించాడు.

'నేను రేపు మద్రాసు వెళ్లామనుకుంటున్నాను ఉషా!' అన్నాడు ఇద్దరూ నడుస్తూ వచ్చి గార్డెన్‌లో కూర్చున్నారు.

'అంత తొందరగా వెళ్లిపోతున్నావేం?' ఉష కంఠంలో బాధధ్వనించింది.

'నాకిక్కడ యెవరున్నారని ఉండను ఉషా! అసలు యెక్కడా నాకెవరూలేరు. అక్కడ ఉద్యోగాలకు యింకా బాగా అవకాశాలుంటాయని ఆశగా ఉంది', ప్రకాశరావు కంఠంలో తొణికిసలాడిన దైన్యం ఉషను కదల్చివేసింది. కొంతసేపు యిద్దరూ మౌనంగా ఉండిపోయారు.

'ఉషా!' ప్రకాశరావు పిలుపువిని ఆమెతలెత్తి చూచింది. ఆమె కళ్లు ప్రేమ ఆత్మీయలతో మెరుస్తున్నాయి. ఆమె కళ్లలోని భావాల్ని చదవగల్గిన ప్రకాశరావు హృదయం ఉరకలు వేసింది.

'నీవే నా సర్వస్వం ఉషా! నా జీవిత భాగస్వామినివైతే నేను ధన్యుణ్ణి. కాని ...! కాని మన అంతస్తులు వేరు. కలలోకూడ నేను నీ సాంగత్యాన్ని ఊహించడానికి అర్హుణ్ణికాదు. లోకం, నేను నీ డబ్బు, అందంచూచి స్నేహంచేశానని భ్రమపడుతూంది. కాని నేను ఆశించేది నీ ఆత్మీయతేనని నీవైనా గ్రహిస్తావనుకుంటున్నాను ఉషా! మనం మళ్లా కలుసుకుంటామోలేదో! ఈ అభాగ్యుడిని మాత్రంమర్చిపోకు!' ప్రకాశరావు వెళ్లడానికి నాలుగడుగులు వేశాడు. ప్రకాశరావు అభిప్రాయం గుర్తించిన ఉష మురిసిపోయింది.

'నేను అదృష్టవంతురాల్ని ప్రకాశం!' ఆమె ఎఱ్ఱని పెదవులమీద చిరునవ్వు మెరిసింది. తడబడే అడుగులతో వెళ్లిపోయింది. ఆమె వెళ్లినవైపే చూస్తూ ఉండిపోయాడు. ప్రకాశరావు.

♦ ♦ ♦

పోర్టికోలో కారెక్కుతున్న ఉషను శ్రీరాం పిలిచాడు.

'ఇంకో గంటలో నిన్ను చూడటానికి ప్రొఫెసరు మూర్తివస్తున్నారు. ఇప్పుడే ఫోన్ కాల్ వచ్చింది. ఎక్కడికి వెళ్లకు ఉషా!' వాత్సల్యంతో ఉషతల నిమిరాడు. ఆమెకు తలపై పిడుగుపడినట్లయింది. మౌనంగా తనగదిలోకి వెళ్లిపోయింది.

మూర్తిరావడం, ఉషను చూచి వెళ్లడం జరిగాయి. మూర్తిని సాగనంపి లోపలికివచ్చిన శ్రీరాం వెక్కి వెక్కి యేడుస్తూన్న ఉషనుచూచి తెల్లబోయాడు.

'ఎందుకు యేడుస్తున్నావు ఉషా?' ఆప్యాయంగా ప్రశ్నించాడు.

'నాన్నా!' ఆశనిండిన కళ్ళతో తండ్రివైపు చూచింది.

'ఏమిటమ్మా నాతో చెప్పు'!? అన్నాడు.

'నేను ప్రకాశరావుని పెళ్లి చేసుకోవాలని నిశ్చయించేసుకున్నాను నాన్నా!' అని చెప్పింది. అంతలోనే శ్రీరాం ఉగ్రుడైనాడు.

'కూటికిగతిలేని బికారిని చేసుకుందామనుకుంటున్నావా? మనపరువుకి, హోదాకి భంగం కలుగుతుందన్న జ్ఞానంలేదూ?' తీవ్రంగా ప్రశ్నించాడు.

'ప్రకాశరావు గౌరవమూ, ప్రేమైకహృదయమూ కలిగిన వ్యక్తి, అతన్ని చేసుకున్నంత మాత్రాన పరువుకేనాడూ భంగం కలుగదు. ఇక పోతే హోదాకి, వివాహానికి సంబంధమేలేదు; ప్రశాంతంగా అన్నది.

'నీవతన్నే చేసుకుంటే ఆస్తిలో చిల్లిగవ్వ నీకు దక్కదు. నీకూ, నాకు యే విధమైన సంబంధమూ ఉండదు. ఏకాకిని, దరిద్రుడివి నా అల్లుడని చెప్పకోలేను,'' విసురుగా అన్నాడు.

'ప్రకాశరావు కంటె నాకు డబ్బుయెక్కువ కాదు. తన స్వయం కృషితో తప్పకుండా మంచి పదవిలోకి వచ్చి నా సుఖం చూస్తాడు. నిష్కల్మషంగా ప్రేమించే హృదయంకంటె ఆడంబరాలు, హోదా ముఖ్యమని భ్రమింపజేసే ధనిక వాతావరణం యెన్నిటికీ ఉన్నతమైనదికాదు;' ఉష అన్నది.

'నీనిశ్చయిం మార్చుకోవన్నమాట!' శ్రీరాం గద్దించాడు.

'సమయానుకూలంగా ఉద్దేశాలు మార్చుకోవడం నా మతంకాదు!' అన్నది ఉష.

శ్రీరాం మౌనంగా కోపంగా వెళ్లిపోయాడు.

♦ ♦ ♦

శుభముహూర్తంలో ఉషా ప్రకాశరావుల వివాహం చాల సామాన్యంగా జరిగిపోయింది, ఎంతో వైభవంగా జరుగుతుందని ఊహించినవారంతా నివ్వెఱపోయారు. ఉషతమకు దక్కలేదనే అసూయతో కొందరు విద్యార్థులు ఆమెకు తగినశాస్తి అయిందని సంతోషించారు. శ్రీరాం కోపంగా, ముభావంగా ప్రవర్తించాడు.

తండ్రి ఆదరణ కరువైన ఉష ఆ యింట్లో ఉండలేకపోయింది. సంతోషమూ, బాధానిండిద హృదయంతో భర్త వెంట మద్రాసు వెళ్లిపోయింది.

♦ ♦ ♦

ప్రకాసరావు ఎమ్. ఏ. ఉష బి. ఏ ఫస్టుక్లాసులో ప్యాసయారు. ఆనాటి నించి అతను దరఖాస్తుపెట్టని ఉద్యోగంలేదు. కాని యెక్కడాలభ్యంకాలేదు. ఉష దగ్గిరున్న డబ్బుచాల భాగం అయిపోయింది. ఆమెను చూసి ప్రకాశరావు జాలిపడేవాడు.

'సిరిసంపదలతో తులతూగవలసినదానివి ఉషా! ఈ దరిద్రుడితో అష్టకష్టాలూ అనుభవిస్తున్నావు?' అనేవాడు.

'మీరలా అంటే సహించలేను. ప్రేమైకహృదయంకంటె క్షణికమైనదబ్బెప్పుడూ ముఖ్యంకాదు' ఉష విశాలనేత్రాలు ప్రేమతో మెరుస్తూంటే ప్రకాశరావు కళ్లు చెమర్చేవి.

ఉషకూడ ఉద్యోగ ప్రయత్నం చేయసాగింది. కొద్దిరోజులకే ఆమెకు, స్త్రీలకు ప్రాముఖ్యతఉండే ఒక బిజినెస్ ఫర్మలో ఉద్యోగం దొరికింది.

'ఇక నీ సంపాదన తినికూర్చొమన్నావా ఉషా?'

అన్నాడు. అతనికి ఉష ఉద్యోగం చేయడంమెంత మాత్రం యిష్టంలేదు.

'నేను కొన్నాళ్లు చేస్తాను. మీరు ఐ. ఏ. యస్‌కి కట్టండి. నేను చేస్తున్నానని అనవసరంగా బాధ పడకండి', అన్నది ఉత్సాహంగా. ప్రకాశరావుకి యిష్టంలేకపోయినా పరిస్థితుల ప్రాబల్యంవలన ఒప్పుకోక తప్పలేదు.

◆ ◆ ◆

'ఉష ఉద్యోగం చేస్తూందికదూ! ఎలాగైనా స్త్రీ సంపాద తింటూ యెలా కూర్చున్నావో?' వికటంగా నవ్వుతూ ఒక స్నేహితుడు ప్రకాశరావు హృదయంలో అగ్నిరగిల్చాడు. అతను ఉషచేత తిరస్కరింపబడ్డాడు. ప్రకాశరావు చిన్నబోయి మౌనంగా వెళ్లిపోయాడు.

ఉషా ప్రకాశరావుల అన్యోన్యతచూచి ఓర్వలేనివారు, ఉష తమకు భార్యకాలేదనే అక్కసు గలవారూ ప్రకాశరావు తారసపడగానే ఉష ఉద్యోగం ప్రశక్తితెచ్చి అతన్ని చిన్నబుచ్చి హేళనగా మాట్లాడసాగారు. క్రమంగా ప్రకాశరావు విసుగెత్తిపోయాడు, ఆ మాటల ప్రభావంవలన అతనికి ఉషపై మూర్ఖకోపం వచ్చింది. ఆమె తనను అవమానించడానికే చేస్తూందని, తన లక్ష్యం లేకపోవడంవలననే తనువద్దన్నా ఉద్యోగంలో చేరిందని భావించసాగాడు. ఉషతో ముభావంగా ఉండటం ప్రారంభించాడు.

'నాతో సరిగ్గా మాట్లాడటంలేదేం?' అని అడిగింది ఒక రోజున.

'నన్ను నలుగురిలో తలెత్తుకొని తిరగనీయదల్చుకో లేదా ఉషా?' సంబంధంలేని యెదురు ప్రశ్న లేశాడు. అతని కంఠంలోని తీవ్రత ఉషను కలవరపరిచింది. విషయం సులువుగా అర్థం చేసుకుంది.

'మనమంటే కిట్టని మూర్ఖులమాటలు విని బాధపడకండి. నా మనస్సులో అటువంటి ఉద్దేశంలేదు, సంసారంలో యిద్దరికీ సమానబాధ్యతలున్నాయి;' ఉష ప్రకాశరావుని అనునయించింది. ఆమె మాటలు అతనిలో యేమార్పు తేలేకపోయాయి.

◆ ◆ ◆

ప్రకాశరావు ఐ. ఏ. యస్ పరీక్షలో ఇంటర్వ్యూలో విజయం పొందడం వెంటనే ఉద్యోగంలో చేరడంజరిగిపోయింది. ఆర్డర్సువచ్చిన రోజున ఉష పొందిన ఆనందానికి మేరలేదు. తమ కష్టాలుతీరి పోయాయని, 'ఇక నీవు ఆఫీసరు భార్యవే ఉషా!' అని ప్రకాశరావు చలిపిగా తనకళ్లలోకి చూస్తాడని, యిన్నాళ్ళూ అనుభవించిన ఆవేదన అంతమై పోతుందని మురిసిపోయింది. స్వీట్సు చేసి భర్త రాకకోసం ఆత్రుతగా యెదురు చూడసాగింది.

ప్రకాశరావు యెదురుగానిల్చున్న ఉషను గమనించనట్లుగా లోపలికి వెళ్ళిపోయాడు. ఉష ఉత్సాహం అణగారిపోయింది.

'ఉద్యోగం వచ్చినంత మాత్రాన యివన్నీ యెందుకు?' స్వీటుని విసురుగా ప్రక్కకి నెట్టివేశాడు. ఉషకు దుఃఖం పొంగుకొచ్చింది. తన జీవితంలో ఆశించిన మధురక్షణాలు యెండమావులవుతున్నాయా? ప్రకాశరావులో యెందుకీ కాఠిన్యం? తనపై అందరికీ యెందుకీపగ? బాధతో కూర్చుండిపోయింది.

◆ ◆ ◆

ప్రకాశరావు ఆఫీసరు. చక్కటి చిన్నబంగళా, కారు ఉన్నాయి. ధనవంతులైన స్నేహితులకు కొదవలేదు. పూర్వపుమంచితనం పోయింది. అహంభావం, నిర్లక్ష్యంపాతుకున్నాయి. ఎప్పుడూ స్నేహితులతో సినిమాలకు, క్లబ్బులకూ తిరుగుతూ ఉండేవాడు. ఉషతో మాట్లాడటమే కరువైపోయింది. ఉష తన్నవమానించడానికే ఉద్యోగం చేసిందని, తనంటే లక్ష్యంలేదని అతనికొక మూఢవిశ్వాసం.

ప్రకాశరావు తనతో మాట్లాడతాడేమోనని ఉష ఆశతో యెదురుచూచేది. కల్పించుకొని మాట్లాడ ప్రయత్నించేది, ఒక్కొక్కసారి సమాధానమే చెప్పేవాడుకాదు. ఆరోజు ఉష కాఫీ కప్పుతెచ్చి టేబిలు మీదపెట్టింది. చూడనట్లుగా పేపరుచదువుకోసాగాడు.

'నేనంటే యెందుకీ కోపం? నేనేం తప్పు చేశాను' అని అడిగింది రుద్ధకంఠంతో

'ఇష్టంలేనిపని చేసి విసిగించడమే కాక యింకా బాధపెట్టడానికి ప్రయత్నించకు ఉషా!' చటుక్కున వెళ్ళిపోయాడు. ఉష కన్నీళ్లతో నిల్చుండిపోయింది.

ఒకసారి ఉషకు జ్వరం వచ్చింది. ప్రకాశరావు

లక్ష్య పెట్టకుండా తన కార్యక్రమాల్లో మునిగి పోయాడు.

'నా దగ్గర కొంచెం సేపు కూర్చోరూ?' హీన స్వరంతో భర్తను పిలిచింది.

'నాకు టెన్నిసుకి టైమవుతూంది,' విసుక్కొని వెళ్ళిపోయాడు. ఉష క్రుంగిపోయింది. ప్రకాశ రావెంత మారిపోయాడు! తనంటే ఎంతటి ప్రేమానురాగాలు ఉండేవి! ఉద్యోగం చేసినంత మాత్రాన తనకు అతనంటే లక్ష్యం లేనట్లేనా? తనవతడు అర్థం చేసుకోలేడా? ఈ సిరి సంపదలు యిద్దరి మధ్య అగాధం కల్పించడానికే కారణమైనాయి! తన జీవితం యెంతటి దుర్భరమైపోయింది. ఉష బాధతో యేడుస్తూ కూర్చుండి పోయింది.

ఉష చాల దుర్బలురాలైంది. ఆమెకు మనస్సిచ్చి మాట్లాడేవారే కరువైపోయారు. సౌందర్యంతో మెరుగులీనే ఆమె ముఖం నిరంతరావేదనతో కళా విహీనమైపోయింది. ప్రకాశరావుకి ఉష అంటే నిర్లక్ష్యం, ద్వేషం యెక్కువైనాయి.

ఒకనాడు ఉష కారుమీద మార్కెట్ వెళ్లింది. ఈ లోపున ప్రకాశరావు వచ్చి కారు లేనందుకు మండి పడ్డాడు. కాఫీ త్రాగుతూంటే ఉష వచ్చింది.

'ఇష్టం వచ్చినప్పుడల్లా షికార్లకు వెళ్లుతున్నా వన్నమాట? నేనంటే లక్ష్యం ఉందీ? శ్రీమంతురాలివి కదూ!' హేళనగా, కోపంగా అన్నాడు. ఉషకా మాటలు ములుకుల్లా గ్రుచ్చుకున్నాయి.

'ధనరాసులే కావలసి వుంటే మిమ్మల్నే చేసుకునే ఉండను,' బాధగా అన్నది.

'గొప్ప త్యాగం చేస్తున్నట్లు నటించి నన్ను అవమానం చేయడానికేకదూ చేసుకున్నావు!' తీవ్రంగా అన్నాడు.

"స్త్రీ యెన్నడూ భర్తను అవమాన పరచాలని అనుకోదు. కష్ట సుఖాలు సమానంగా పంచుకొని సంసారంకోసం అవకాశాల్నిబట్టి యెవరు పాటు పడినా ఒకటి కాదా? మనని చూచి అసూయపడే మూర్ఖుల మాటలు విని అనవసరంగా బాధపడి బాధ పెట్టడం భావ్యమా?' గద్గద స్వరంతో అడిగింది.

'మాటలతో మభ్యపెట్ట ప్రయత్నించకు ఉషా! ఇంకా ఆత్మ గౌరవాన్ని చంపుకుంటూ నీ మాట ప్రకారం నడవలేను. నేను నిన్ను బాధ పెడుతున్నానని నీ అభిప్రాయమైతే యీనాడే నీవు వెళ్లిపో వచ్చును. నాకు శాంతిగా ఉంటుంది', ప్రకాశరావు ఆడిన ప్రతిమాటలో కాఠిన్యం, అహం తొణికిసలాడాయి.

ఈ మాటలు వింటూన్న ఉష కళ్ళముందు గత జీవితం మెరిసింది. ఆనాడు తన ప్రకాశం యేమన్నాడు!

'లోకం నీడబ్బు, అందంచూచి నీతో స్నేహం చేశానని భ్రమ పడుతూంది ఉషా! నీ ఆత్మీయత నా ఒంటరి తనాన్నీ మరుగు పర్చింది. నా సర్వస్వం నీవే. నీవు నా జీవిత భాగస్వామినివైతే ధన్యుణ్ణి!' ఆ మాటలంటున్న అతని కళ్లలో ప్రేమా మంచితనం తొణికిసలాడేవి.

కాని—! యీనాడేమైంది? డబ్బే ముఖ్యంగా పరిగణించి, మూర్ఖాభిప్రాయాలతో చెప్పుడు మాటలు విని తనను బాధ పెడుతున్నాడు! తనను చేసుకో వడం వలన మనశ్శాంతి కోల్పోయానని నిందవేస్తున్నాడు! ఎంత కఠినుడైపోయాడు! కాదు! ప్రకాశరావు! తన భర్త! తన జీవిత సర్వస్వం! అతను దూరం కాకూడదు! ఉష మనస్సులో వివిధ భావాలు చెలరేగాయి.

'ప్రకాశం! నీ ఉషనే ప్రకాశం! నేనంటే ప్రేమ లేదూ?' పిచ్చి ఆవేశంతో అతనివైపు పరుగెత్తింది. కాని విదిలించుకొని వెళ్లిపోయాడు.

ఉష భర్త వెళ్లిన వైపే చూస్తూ ఉండిపోయింది. తన జీవితం యెంత హీనమై పోయింది! తను చదువుకునే రోజులెంత హాయిగా వుండేవి! ఆనాటి తన ప్రకాశం యెంత మంచివాడు! ఆమెకు తండ్రి జ్ఞాపకం వచ్చాడు. తననెంత ప్రేమగా చూచేవాడు తల్లిలేని లోటు యేనాడూ కన్పించలేదు! అంత ప్రేమగాచూచే తండ్రిని కాదనివచ్చినందుకు తనకిదేనా సుఖం! ఇటువంటి నిరాదరణ కోసమే నా ప్రకాశరావుని వివాహం చేసుకున్నది! టేబిలు మీదున్న భర్త ఫోటో వైపు చూస్తూ ఆలోచనల్లో పడిపోయింది ఉష

♦ ♦ ♦

కారు హైరోడ్ మీదుగా వెళ్లిపోతూంది. ప్రకాశరావు కళ్ళ యెదుట ఉష విగ్రహమే కనబడ సాగింది. అందమూ, ఠీవీ, ఉత్సాహమూ మూర్తీభవించిన ఉష! మరుక్షణం పాలిపోయి నీరసంగా బాధ నిండిన కళ్లతో ఉన్న ఉష అతని మనోనేత్రంముందు మెరిసింది. ఆమె పతనానికి కారణ మెవరు? తను

కాదూ? ఈనాటి తన ఔన్నత్యానికి కారకు లెవరు? తను ఆఫీసరయి సుఖించడానికి పాటుబడి ప్రోత్సహించిన దెవరు? ఉష దిక్కులేని తనను ప్రేమించి తనకోసం అన్ని సౌఖ్యాలూ వదులుకొన్న ఉష దేవత కాదూ! శ్రీమంతుడైన తండ్రినీ, గొప్పయింటి యువకుల్నీ తిరస్కరించి తనను వివాహమాడిన ఉషను హృదయంలో దాచుకొని ప్రేమించవలసిన బాధ్యత తనదికాదూ! మూర్ఖుల మాటలు విని మానవత్వం చంపుకొని తను ఉష నెంత బాధ పెడుతున్నాడు! 'స్త్రీ భర్త నవమాన పరచాలని యెన్నడూ ప్రయత్నించదు ప్రకాశం! ఇటు చూడు! నేనే—నీ ఉషని! నేనంటే ప్రేమలేదూ!' ఉష దీన వాక్కులు చెవుల్లో మారుమ్రోగాయి. మొదటిసారిగా ప్రకాశరావుకి పశ్చాత్తాపంతో దుఃఖం వచ్చింది. ఉష నిక యే మాత్రం బాధ పెట్టకూడదని సంసారంలో కరువైపోయిన ఆనందాన్ని నెలకొల్పాలని అనుకుంటూ కారును వడిగా యింటి వైపు పోనిచ్చాడు.

♦ ♦ ♦

'ప్రకాశరావుకి మనశ్శాంతి తనవలని లేనప్పుడు తనెందుకీ ప్రపంచంలో? తనెవరికీ అక్కర్లేదు! ఉష ఆఖరి ఆలోచనలో శాశ్వతంగా ప్రపంచానికి దూరమైపోవాలనే నిశ్చయానికి వచ్చింది. గదిలోకి వెళ్ళి తల్లి ఫోటోకి నమస్కరించింది. గ్లాసులోని ద్రవం త్రాగింది. మృత్యుదేవత ప్రేమతో ఉషను తన ఒడిలోనికి తీసుకుంది.

'ఉషా!' అని పిలుస్తూ ప్రకాశరావు గదిలో అడుగు పెట్టాడు. నిర్జీవంగా పడివున్న ఉషను చూచి నిర్ఘాంత పోయాడు. 'ఉషా! నన్ను మన్నించవూ!' అంటూ ఆమె చేతులు తన చేతుల్లోకి తీసుకొని అంతులేని ఆవేదనతో దుఃఖించాడు.

ఉష మరణంతో తిరిగి ప్రకాశరావు ఒంటరివాడై పోయాడు. స్నేహితులు దూరమైనారు. విలాసాలన్నీ వదులుకొని నిరాడంబరమైన జీవితాన్ని గడప సాగాడు. ఉష ఫోటో చూచినప్పుడు అంతులేని ఆవేదనతో క్రుంగి పోయేవాడు.

♦ ♦ ♦

ప్రకాశరావు వెంటనే బయల్దేరి శ్రీరాం వద్దకు వెళ్ళాడు

♦ ♦ ♦

'ఉష యేదీ ప్రకాశం! నా చిట్టి తల్లి ఉష యేదీ?' గుమ్మంలో అపరాధివలె నిలవంచుకొని నించున్న ప్రకాశరావును శ్రీరాం రుద్ధ కంఠంతో ప్రశ్నించాడు. అతని కళ్లు ఆత్రుతతో ఉషకోసం వెదుకుతున్నాయి. ముఖంలో జీవకళ తగ్గిపోతూంది.

'ఉష లేదు! నేను ఆమెను నిరాదరణ చేసిన ఫలితంగా ఆమె శాశ్వతంగా వెళ్ళిపోయింది. అధికార మదంతో మూర్ఖంగా ఉషను బాధ పెట్టాను. నేను ద్రోహిని!' గద్గద స్వరంతో అన్నాడు ప్రకాశరావు.

'ఏమిటీ? ఉషలేదూ? నా చిట్టితల్లి ఇక కనిపించదూ? అయ్యో! ఉషా! కన్నతండ్రినైకూడ మూర్ఖంతో నిన్ను దూరంచేసుకొని యెంత ద్రోహం చేశాను! ఇక నేను నిన్నువిడిచి వుండలేను నీ దగ్గరకే వచ్చేస్తున్నా ఉషా!' శ్రీరాం ఆవేదన అణగారి పోయింది, ఉషకోసం వెదికే అతని కళ్లు శాశ్వతంగా మూసుకుపోయాయి.

కన్నీళ్ళతో బరువుగా అడుగులు వేసుకుంటూ బైటికి వెళ్ళిపోయాడు ప్రకాశరావు.

డాక్టరు కే. యన్. కేసరిగారి

నా చిన్ననాటి ముచ్చట్లు

వెల రు. 2.00 లే — పోస్టేజి ఉచితం

హిగిన్ బాథమ్స్ స్టాల్సులో దొరుకుతుంది